జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

ఆదివారం | 1 | మార్చి | 2026 • పేజీలు : 12



## పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు

- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవంలో భాగంగా స్థానిక నెహ్రూ పార్క్ సెయింట్ మేరీస్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ నియోజకవర్గ శాసనసభ సభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరు అయ్యి పిల్లలలో

మిగతా 2 లో...




# పట్టుదలతో అందరం కలిసి... మహా జాతరను విజయవంతం చేశాం...

- అభివృద్ధి పనులు అనేవి నిరంతర ప్రక్రియ.
- 200 సంవత్సరాలు నిలిచిపోయేలా పనులు చేశాం
- పూర్తికాని 5 శాతం పనులను వెంటనే పూర్తి చేయాలి
- బాసర నుండి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరిగిన మేడారం మహా జాతర విజయవంతం కావడానికి అందరం పట్టుదలతో పనిచేయడం వల్లే విజయవంతమైందని,మేడారంలో భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయం నిరంతర ప్రక్రియ అని రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయంనకు హెలికాప్టర్ లో చేరుకున్న రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క లకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, తదితరులు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల

మిగతా 2 లో...



## గంజాయి రహిత నగరంగా మారుద్దాం

- మత్తును నుండి యువతను కాపాడుకుందాం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం
- అక్రమ ఇసుక రవాణాకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించండి

**హన్మకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28, (ప్రజాజ్యోతి):** దేశ భవిష్యత్త యువత గంజాయి మత్తు బానిసలు కాకుండా గంజాయి విక్రయించే మూలాలపై దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ మెడికల్ కళాశాలో ఎర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్

మిగతా 2 లో...

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం


- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ధర్మసాగర్, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి)** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల కంపౌండ్ వాల్ నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో వివోమహిళా భవనం నిర్మాణ పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు

మిగతా 2 లో...

## "కొలువుల కోసం కొట్లాట"



- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే 80% ఉద్యోగాలు ఇవ్వాలి
- బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

**హన్మకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28, (ప్రజాజ్యోతి):** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. శనివారం హన్మకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో "కొలువుల కోసం కొట్లాట" పేరిట నిర్వహించిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ

మిగతా 2 లో...

## "కొలువుల కోసం కొట్లాట"



(మొదటి పేజీ తరువాయి...)

"మా ఉద్యోగాలు మాకే కావాలి" అనే నినాదంతోనే నాడు కే. చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుతోనే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమైందని, స్థానికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదాయ శాఖకు చెందిన 150 ఎకరాల భూమిని ప్రత్యేక అనుమతులతో కేటాయించిందన్నారు. అయితే ప్రస్తుతం ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. మహారాష్ట్ర లాతూర్ వ్యాగన్ ఫ్యాక్టరీలో 70 శాతం స్థానికులకు రిజర్వేషన్ ఇచ్చినట్లే కాజీపేటలోనూ అమలు చేయాలని, కోచ్ ఫ్యాక్టరీపై వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులకు, నిర్వాసితులకు రిజర్వేషన్ కల్పించకుండా కేంద్ర మంత్రులు ప్రారంభోత్సవానికి వస్తే బీఆర్ఎస్ పక్షాన అడ్డుకుంటామని హెచ్చరించారు. కాజీపేట జంక్షన్ ప్రాధాన్యత తగ్గిపోతుందని, దాన్ని రైల్వే జోన్‌గా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు డా. తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఆరూరి రమేష్, శంకర్ నాయక్, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు సదానందం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి...)

డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించడం, మహిళలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్మాణాల ప్రధాన లక్ష్యమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పారం గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక – వెంకట్, ఉప సర్పంచ్ కుమారస్వామి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు గొల్లపల్లి వెంకటరాజ్యం, గోనెల రాజన్న, మాజీ ఎంపిటిసిలు కందుకూరి ప్రసాద్ పెద్ద శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి రహిత నగరంగా మారుద్దాం

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా యం.జి.యం, రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో సైతం సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని గంజాయిని విక్రయించే వారినీ గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, అక్రమ ఇసుక రవాణాపై స్టేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎవరైన ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని, అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్,కవిత, శుభంనాగ్‌తో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.

# పట్టుదలతో అందరం కలిసి మహా జాతరను విజయవంతం చేశాం...





(మొదటి పేజీ తరువాయి...)

మంత్రి దనసరి అనసూయ సీతక్క లు వనదేవతలను దర్శించుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,సీతక్క సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్దరాజు దేవతల గద్దెల చుట్టూ రాతి నిర్మాణాన్ని, ఆలయ చుట్టూ ప్రకారం , ప్రధాన ఆర్చిలను, ప్రహరీ సాండ్ స్టోన్ చిత్రాలను, చుట్టూ డ్రైనేజీ,మీడియా టవర్లను,గద్దెల చుట్టూ ఉన్న గ్రిల్స్ లను ఆలయ ఫ్లోరింగ్ ను కూలంకషంగా పరిశీలించారు.అనంతరం వాహనంలో జంపన్నవాగు, హరిత హోటల్,ఊరట్టం, చిలకలగుట్ట,ఆర్ టి సి జంక్షన్ లను కూలంకషంగా పరిశీలించారు.అనంతరం మంత్రులు మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత జిల్లా అధికారులతో మేడారం జాతర అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాఖల వారిగా పనుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..మేడారంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి నిత్యం భక్తులు వివిధ ప్రాంతాల నుండి చేరుకుంటున్నారని, సెలవు రోజులలో లక్షలాది మంది భక్తులు అమ్మవార్ల దర్శన భాగ్యం కోసం చేరుకుంటున్నారని అన్నారు.మేడారం చేరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని,ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టిసారించాలని సూచించారు. ఆలయ ప్రాంతంలో చేపట్టిన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,గుత్తేదారులకు ఎట్టి పరిస్థితుల్లో బిల్లులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పట్టుదలతో జాతరను ఎన్నడు లేని విధంగా విజయవంతం చేయాలన్న సంకల్పంతో 251 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ప్రధాన ద్వారంతో పాటు గద్దెల ప్రాంతం చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏర్పాట్లు చేశామని,2 వందల ఏండ్ల వరకు చెక్కు చెదరకుండా పనులు చేయడం జరిగిందని వివరించారు.మహా జాతరకు వచ్చిన భక్తులకు త్రాగునీరు ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నివాస స్థలాలు ఏర్పాటు చేసి అధికారులు విజయవంతం చేశారని, ముఖ్యంగా పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం చెప్పుకోదగ్గ విషయమని అధికారులను అభినందించారు.జాతరకు ముందే 95 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగతా ఐదు శాతం పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఆలయం పునర్నిర్మాణం చేయడం జరిగిందని, భవిష్యత్తు తరాలకు 200 ఏండ్ల వరకు ఎంత మంది భక్తులు వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావాల్సిన వసతులను రోడ్ల విస్తరణ నివాసయోగ్యం ఇతర వసతులు కల్పించడం జరిగిందని,అమ్మవార్ల గద్దెలు ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రపంచం మొత్తం జాతర వైపు చూసిందని పేర్కొన్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా మిగిలిన పనులను త్వరలోనే నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తి స్థాయిలో పెండింగ్ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం ప్రాంతంలో ఉన్న రెండు చెరువులను సుందరీ కరించాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం జంపన్నవాగులో నిరంతరం నీరు ప్రవహించే విధంగా చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, రహదారులకు ఇరువైపులా ప్లాంటేషన్ చేయాలని అన్నారు.భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి శాశ్వత ప్రతిపాదికన త్రాగు నీరు మరుగుదొడ్లు మౌళిక వసతులు కల్పించాలని, జాతర సమయంలో దెబ్బ తిన్న చిన్న చిన్న పనులను ఆలయ ఫ్లోరింగ్ డ్రైనేజీ వ్యవస్థ లోపాలను గుర్తించి వాటిని వెంటనే సరి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా జాతర అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని,జాతర అనంతరం అధికారులకు మరింత బాధ్యత పెరిగిందని మనసా వాచా కర్మణా మిగిలిన పనులను పూర్తి చేయాలని అన్నారు. మేడారం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం ప్రజా ప్రభుత్వం రెండవ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం జరుగుతుందని దానిలో భాగంగా మేడారం ప్రాంతం లోని రెండు చెరువులను అభివృద్ధి చేయడం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్,మీడియా భవన్ వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.జాతర విజయ వంతంలో అధికారులు చేసిన కృషి ఎన్నటికీ మరువలేమని కొనియాడారు.సిఎం రేవంత్ రెడ్డి అమ్మవార్ల శక్తిని గ్రహించి ప్రతి పని విషయంలో చోరవ చూపారని, ఏకంగా క్యాబి నెట్ సమావేశం నిర్వహించి అమ్మవార్ల భక్తి చాటారని అన్నారు.నిత్యం తరలి వస్తున్న భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా అన్నిశాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు.జాతర విజయవంతానికి తోడ్పడిన జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ,గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లకు,కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతర అనంతరం మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. జాతర నిర్వహణలో జరిగిన అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ & బి ఈఎన్ సి మోహన్ నాయక్,జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ములుగు మున్సిపల్ చైర్మెన్ చింతనిప్పుల చంద్రకళ, ఈఓ వీరస్వామి ,పూజారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలలో సృజనాత్మకతను వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు

(మొదటి పేజీ తరువాయి...)

సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగపడతాయని, ప్రతి ఒక విద్యార్థి కూడా అన్ని రంగాలలో ప్రతిభను సాధించాలని, ప్రతి విషయంలో ప్రశ్నించడం నేర్చుకోవాలని అప్పుడే జ్ఞానాన్ని సమకూర్చుకోగలుగుతారని విద్యార్థులకు సందేశం ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సుమారుగా 200 రకాల నమూనాలను తయారు చేసారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం పద్మ శ్రీ దేవి , ప్రిన్సిపాల్ బసాని శ్రీధర్ రెడ్డి , ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రశంసించడం జరిగింది.

## ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**జనగామ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి ):** ప్రాథమిక పాఠశాల కొడకండ్లలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శనివారం ప్రాథమిక పాఠశాల కొడకండ్లలో జాతీయ విజ్ఞాన దినోత్సవ కార్యమాన్ని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు అనేక రకరకాలైన యంత్రాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దోర్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారత ప్రముఖ శాస్త్రవేత్త సి.వి. రామన్ "రామన్ ప్రభావం" అనే గొప్ప ఆవిష్కరణను ప్రపంచానికి తెలియజేశారని, ఈ మహత్తరమైన ఆవిష్కరణకు ఆయనకు నోబెల్ బహుమతి లభించిందని. అందుకే ఈ రోజును జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. విజ్ఞానం మన జీవితంలో చాలా ముఖ్యమైనదని, మనం ఉపయోగించే విద్యుత్ దీపాలు, ఫోన్లు, కంప్యూటర్లు, వాహనాలు, ఇవన్నీ శాస్త్రవేత్తల కృషి ఫలితమేనని, శాస్త్రం లేకపోతే మన జీవితం చాలా కష్టంగా ఉండేదని, మన భారతదేశంలో అనేక గొప్ప శాస్త్రవేత్తలు ఉన్నారని, ఏపీజే అబ్దుల్ కలాం భారత దేశాన్ని క్షిపణి శక్తిగా మార్చారని, హోమీ జె. బాబా అణు శక్తి అభివృద్ధికి ఎంతో కృషి చేశారనీ వీరందరూ మనకు ఆదర్శప్రాయులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమేష్, వేణు, కవిత, వెంకటయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్బిట్ ఐ–టెక్నో పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన







**హసన్‌పర్తి,ఫిబ్రవరి–28 (ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఐ–టెక్నో పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా అద్భుతమైన వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీమతి హారిక భగవాన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించి, నూతన ఆవిష్కరణల దిశగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో అందుబాటులో ఉన్న సామగ్రితో అనేక వినూత్న ఆవిష్కరణలను రూపొందించారు. ప్రదర్శనలో యాంత్రిక మనిషి, క్షిపణి పనితీరు, గగనతల చిత్రీకరణ పరికరం, పండుగల ప్రాముఖ్యతను వివరించే చిత్రపటాలు, రక్త పరీక్ష కేంద్ర నమూనా, ద్రవ ఒత్తిడి యంత్రం, ధూళి శోధక యంత్రం, చుక్కల పద్ధతిలో సాగునీటి సరఫరా నమూనా, పచ్చగృహం, జలచక్ర వాహనం, జలధార యంత్రం, అగ్నిపర్వత నమూనా, మట్టి త్రవ్వే యంత్రం నమూనా, స్వయంచాలక రైల్వే గేటు, స్వయంచాలక రహదారి దీపాలు, ప్రమాద హెచ్చరిక పరికరం, ద్రవ లిఫ్ట్, అగ్ని హెచ్చరిక పరికరం, పరమాణు నిర్మాణ నమూనా, దూరదర్శిని, గాలితో చల్లబరిచే యంత్రం, మూత్ర పిండాలు, గుండె, జీర్ణవ్యవస్థ పనితీరు, కిరణజన్య సంయోగక్రియ విధానం, ఆమ్ల వర్షాల ప్రభావం, సౌర కుటుంబం, నీటి శుద్ధి విధానం తదితరంగా నూట యాభైకు పైగా ఆవిష్కరణలు ప్రదర్శించారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజ్ఞాన విభాగానికి చెందిన ఉపాధ్యాయులు మహేష్, చంద్రమోహన్, అశోక్‌రెడ్డి, రాహుల్‌రాజ్, రూపాదేవి, శ్వేతారెడ్డి, రసజ్ఞ, స్వర్ణలత, ప్రవళికతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనను విజయవంతం చేశారు.

## పేదింటి ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: జిఎస్ఆర్



**శాయంపేట ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి :** పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తూ పేదల సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కులను పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు 23,02,668 విలువ గల చెక్కులను వారి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కొంత ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే అనేక ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని ఆయన అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ చేరువ కావడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో కూడా పాల్గొని వార్డు సభ్యులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఉమా రవిపాల్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, రవి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవం



**ములుగు, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** ములుగు మండలం దేవగిరి పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఎగ్జిబిట్ లు పలువురిని ఆకర్షించాయి. ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే వైజ్ఞానిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగులో ఎండుతున్న పంటలు



**నల్లబెల్లి, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి ):** మండలంలోని అతిపెద్ద చేరువైన గోవిందాపురం శివారు లోని రంగయ్య చెరువు లో నిండుగా నీళ్లు ఉన్నప్పటికీ, ఎడమ కాలువకు నీరు అందక 900 ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని రైతులు వరుసగా అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి, దబ్బీడిపేట, రామారావు తండా, ఇటకాలపల్లి, రాజుపేట ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుడి–ఎడమ కాలువల ద్వారా మూడు వేల ఎకరాలకి సాగునీరు అందించే చెరువు ఇలా నిర్లక్ష్యానికి గురవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి పంటలను రక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## విసర్జ్య పదార్థాలతో వినూత్న ఆవిష్కరణలు

- సెయింట్ మేరీస్ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



**హసన్ పర్తి,ఫిబ్రవరి–28(ప్రజాజ్యోతి ):** శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని హసన్ పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా రూపొందించిన వినూత్న ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకున్నారు.ఖర్చు లేకుండా ఇంటి పరిసరాలలో లభించే విసర్జ్య పదార్థాలను వినియోగించి ఉపయోగకరమైన వస్తువులు తయారు చేసి వాటి వినియోగ విధానాన్ని విద్యార్థులు వివరించారు. గాలి, నీరు, పరిసరాల నుంచి సేకరించిన వ్యర్థాలతో తయారైన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విసర్జ్య పదార్థాల నుంచే అవసరమైన వస్తువులను సృష్టించవచ్చని విద్యార్థులు చూపిన తీరుకు ప్రశంసలు వెల్లువెత్తాయి.ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలికి వస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుమలేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. విజ్ఞాన ఉపాధ్యాయులతో పాటు ఇతర ఉపాధ్యాయులు కూడా ప్రదర్శనల తయారీలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించారని తెలిపారు. ప్రదర్శనల రూపకల్పనలో సూచనలు అందించిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకురాలు వెలిగేటి కల్పనారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, ఎలుక రాజు సదానందం, ఉపాధ్యాయులు జహంగీర్, రాజేంద్రప్రసాద్, అంజద్, సంపత్, విజయరాణి, ప్రియాంక, లలితరాజపుత్, లతారెడ్డి, రజిని, అనురాధ, సంధ్యారాణి, సంధ్యలతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరమల్లు రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి తో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోడిశాల రాజయ్య గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు శనిగరపు వెంకటేష్, గొర్రె ఆదం, సీనియర్ నాయకులు పాక రమేష్, యూత్ నాయకులు గొడిశాల అర్జున్ గౌడ్, సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ మంద సుమన్ గౌడ్, మండల స్థాయి నాయకులు యువజన నాయకులు మహిళ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## రహదారి సమస్యకు మోక్షం

- సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ ఎరుకల లలిత
- ఎమ్మెల్యే దొంతి చొరవతో నిధుల మంజూరు

**నల్లబెల్లి, ఫిబ్రవరి 28(ప్రజా జ్యోతి ):** ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న దళితవాడ రహదారి సమస్యకు మోక్షం లభించింది. నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుండి మంజూరైన సి.సి. రోడ్డు నిర్మాణ పనులను మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో శనివారం స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత రఘు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామంలోని దళితవాడలో రహదారి సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి గ్రామస్తుల తరపున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాణ్యతతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విష్ణు, వార్డు సభ్యులు పబ్బు రాజేష్, ఉట్కూరు కృష్ణ, ఏడాకుల సంపత్ రెడ్డి, చిట్యాల ఉపేందర్ రెడ్డి, బైరి వెంకటేశ్వర్లు, వల్లే పైడి, ఆకుల సతీష్, ముస్కు రఘుపతి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వార్డ్ మెంబర్ల శిక్షణ పూర్తి



**శాయంపేట ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి :** మండలంలోని రైతు వేదికలో 24 గ్రామాల వార్డు మెంబర్లకు ఈనెల 24 నుంచి 28 వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వార్డ్ మెంబర్లకు గ్రామ సమగ్ర అభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర, ఇతర అంశాలపై ఐదు రోజుల పాటు వార్డు మెంబర్లకు అధికారులు ట్రైనింగ్ ఇచ్చి శిక్షణ పూర్తి చేశారు. దీంతో వార్డు సభ్యులకు మండల అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపీ ఓ రంజిత్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- హై స్కూల్ సైన్స్ ఫెయిర్‌కు హాజరైన సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్
- విద్యార్థులకు ప్రోత్సాహం



**ఆత్మకూరు (నీరుకుళ్ళ), ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్ తెలిపారు. శనివారం నీరుకుళ్ళ హై స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు.విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజ్ఞానం ద్వారా సమాజానికి సేవ చేయగలిగే స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. గ్రామ అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలో నిర్వహించే సైన్స్ ఫెయిర్ లో పాల్గొంటేనే భవిష్యత్తులో ఎన్నో ప్రయోగాలు చేయటానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక మట్టి డంపులు సీజ్ చేసిన అధికారులు





- ఎవరిని ఉపేక్షించేది లేదు..
- పరకాల ఆర్డిఓ కన్నం నారాయణ..

**పరకాల ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** పరకాల పట్టణంలో నుండి భూపాలపల్లి వెళ్లే ప్రధాన రహదారి చలివాగు ప్రాజెక్టు దగ్గర సుమారుగా 160 మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుక నిలువలు, 300 మెట్రిక్ టన్నుల మట్టి నిలవలు ఉన్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు హనుమకొండ జిల్లా టిఎస్ఎండిసి పిఓ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో తాసిల్దార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమ ఇసుక నిల్వ చేసిన తోట విజయ్ నగేష్ లదని, అదేవిధంగా అక్రమ మట్టి నిలువ శ్రీనివాస రావులదని గుర్తించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక మట్టిని తరలిస్తే ఎంతటి వారినైనా విడిచి పెట్టే ప్రసక్తే లేదని, చట్టరీ కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అందులో భాగంగా పోలీస్ సిబ్బందితో కలిసి అక్రమ మట్టి ఇసుక నిలువలను సీజ్ చేసినట్లు ఇసుక నిల్వలను తరలించి విషయమును ఆర్డీవో పరకాల నారాయణ దగ్గరుండి పర్యవేక్షించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయల్టీ ఇన్స్పెక్టర్, తాసిల్దార్ విజయలక్ష్మి , గ్రామ పాలన అధికారులు షాకీర్ సారంగపాణి కృష్ణంరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 108 ద్వారా వేగంగా నాణ్యమైన సేవలు అందించాలి


- 108 కి ఫోను రాగానే స్పందించాలి
- ఆత్మకూరు సిబ్బందిని అభినందించిన జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్



**ఆత్మకూరు, ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి):** 108 ద్వారా వేగంగా నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ ను జిల్లా మేనేజర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. అంబులెన్స్లో అన్ని రకాల అత్యవసర మందులు మరియు రిజిస్టర్ల నిర్వహణ, కాలం చెల్లిన మందులు ఏమైనా ఉన్నాయా మరియు వైద్య పరికరాలు ఎలా పనిచేస్తున్నాయో తనిఖీ చేశారు. అత్యవసర ఆపద సమయంలో ప్రజలు 108 కి కాల్ చేయగానే వెంటనే స్పందించి ప్రమాద స్థలికి చేరుకొని అత్యవసర వైద్యం చేసి గవర్నమెంట్ హాస్పిటల్ కు చేర్చాలని సూచించారు. ఎండాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు ఎండాకాలంలో వచ్చే ప్రమాదాల గురించి సిబ్బందికి సూచించారు. ఎండాకాలంలో అత్యవసర సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజులు, గ్లూకోన్ డి, ఐస్ ప్యాక్ లు అందుబాటులో ఉంచామని తెలిపారు. గత జనవరి ఫిబ్రవరిలో ఇప్పటివరకు 150 కేసులు చేసి, ప్రాణాలు కాపాడిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి నరేష్ తక్కళ్లపెల్లి, రమేష్, అనిల్ కుమార్, ప్రకాష్, రాజు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తిలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు





**ఎల్కతుర్తి ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి ):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టి ట్యూడ్ హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త నోబెల్ బహుమతి గ్రహీత భారతరత్న సర్ సి.వి రమన్ తన విప్లవాత్మక ఆవిష్కరణ అయిన రమన్ ఎఫెక్ట్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన రోజు సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ లో విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు వినూత్న ప్రయోగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యావరణ పరిరక్షణ సౌరశక్తి వినియోగం నీటి సంరక్షణ సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాల కరస్పెండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల చిన్నచిన్న ప్రయోగాలే రేపటి మహత్తర ఆవిష్కరణలకు నాంది అవుతాయని వారి భవిష్యత్తు ఉజ్వాలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సర్ సి.వి. రమన్ జీవిత విశేషాలు ఆయన కనుగొన్న రమన్ ఎఫెక్ట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. శాస్త్ర విజ్ఞానం సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, హెడ్మాస్టర్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు ఆశ వేగం, సురేష్, రమేష్, కృష్ణ, సరిత, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా జాతీయ సైన్స్ వేడుకలు

**ధర్మసాగర్, ఫిబ్రవరి28(ప్రజాజ్యోతి):** ధర్మసాగర్ మండలం కరుణాపురం సెయింట్ ఆంథోనీ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే సైన్స్ ప్రదర్శన జరిగింది. ప్రధానోపాధ్యాయులు వేల్పుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ రాజారపు ప్రభుదేవా, డైరెక్టర్ అనూష , విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు చేసిన సైన్స్ మాడల్స్ ను, తిలకించారు. జాతీయ విజ్ఞాన దినోత్సవమును భారతదేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జరుపుకుంటారు. రామన్ ఎఫెక్ట్ ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28ఫిబ్రవరి 1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్నాడు. ఆయన ఈ పరిశోధన ఫలితాన్ని ధృవపరిచిన ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటున్నారు.విద్యార్థులు చేసిన సైన్స్ పరికరాలను తిలకించిన రాజారపు ప్రభుదేవ్ పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాధిక, ఉపాధ్యాయులు దేవకి, రవళి ,కవిత, సుమ, శ్రీలత ,సుమలత , శ్రీకాంత్, హాజీరబీ , ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.





# రాయపర్తి గురుకుల పాఠశాలలో ఘనంగా సైన్స్ డే వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు
- వ్యాసరచన,వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానం
- ప్రిన్సిపాల్ ఎస్ సరిత






**రాయపర్తి ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి** జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సైన్స్ దినోత్సవ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వాటితో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సరిత మాట్లాడుతూ సైన్స్ అనేది నిత్యజీవితంలో చాలా అవసరం అని విద్యార్థులలో సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులు కొత్త ఆలోచనలను, ప్రయోగాత్మకంగా రూపకల్పన చేస్తూ నూతన ఆవిష్కరణలకు బాటలు వేసేలా ప్రయత్నాలు కొనసాగాలని సూచించారు. గొప్ప శాస్త్రవేత్తల జీవిత చరిత్రల పుస్తకాలను చదవాలని, వారి ఆలోచనలతో ముందుకుసాగాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో కొత్త ఆవిష్కరణను శ్రీకారం చుట్టేలా బోధన అభ్యాసన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు సరికొత్త ఆలోచనతో ముందుకు సాగాలన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించడం జరిగింది. అందులో ముఖ్యంగా డ్రోన్, సోలార్ పవర్ స్ట్రీట్ లైట్, జ్ఞానేంద్రియాల నమూనా మరియు సోలార్ సిస్టం,నమూనా డిఎన్ఏ, టెలిస్కోప్ ప్రదర్శన, సైన్స్ మ్యాగజైన్స్,వివిధ శాస్త్రవేత్తల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించడం జరిగింది. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలువురు విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ సరిత బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణ కోసం బోర్ మోటర్ మరమ్మత్తులు

- పంచాయతీ కార్యదర్శి వల్లెపు వినోద్



**రాయపర్తి ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కనగల డబల్ బెడ్ రూముల వద్ద శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి వల్లెపు వినోద్ ప్రజల కోసం వేసవిలో దాహార్తి తీర్చడం కోసం బోరు మోటర్లను రిపేరు చేయించి ప్రజలకు అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆలోచనలతోనే దేశాభివృద్ధి

- రిటైర్డ్ పిజి హెచ్ఎం ఆర్ భాస్కరరావు



**రాయపర్తి ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవం మరియు స్ఫూర్తి కార్యక్రమం పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గాదె ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రావుల భాస్కరరావు రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు స్ఫూర్తి కార్యక్రమము రాయపర్తి మండల కోఆర్డినేటర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన కృత్యాలను పరిశీలించి స్ఫూర్తి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ ఆలోచనలతో శాస్త్రీయ విద్యా విధానాన్ని, జీవితాన్ని గడపాలని శాస్త్రీయ భావనలతో జీవితంలో తీసుకునే నైపుణ్యాలు స్వీయ అవగాహన సమస్య పరిష్కారం సంభాషణ చాతుర్యం నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం నో అని చెప్పగలిగే నైపుణ్యాలు కలిగి ఉండాలని, సృజనాత్మక ఆలోచనలతో జీవితాన్ని కొనసాగించాలని విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థులు సీనియర్ ఉపాధ్యాయులు వీరభద్ర శర్మ ఉప్పలయ్య సురేందర్ కోలా దేవేందర్ రాదా సంధ్య శోభ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను వీడండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించండి

- డివిజన్ స్వచ్ఛంద సంస్థలు



**నర్సంపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** నర్సంపేట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించిన కారణంగా,నర్సంపేట పట్టణం లో ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్, కవర్లను నియంత్రించి, ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ కు డివిజన్ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు వినతి పత్రమును అందజేశారు నర్సంపేట పట్టణ ఫంక్షన్ హాల్స్, హోటల్స్ , టిఫిన్ సెంటర్స్,టి సెంటర్స్ లలో ప్రజలుఎక్కువగా అతి పలుచటి ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్,కవర్స్ లను వాడుతూ,అనారోగ్య బారిన( క్యాన్సర్)పడుతున్నారు..ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఫంక్షన్ హాల్స్,టెంట్ హౌస్,హోటల్స్, టి సెంటర్స్ యజమానులని పిలిపించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా వారికి అవగాహన కల్పించి,ప్రజా ఆరోగ్యాన్ని రక్షించే చర్యలు తీసుకోవాలని డివిజన్ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు కోరడం జరిగింది. దీనికి కమిషనర్ స్పందించిసింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కొరకు తగిన కార్యాచరణ రూపొందించి,ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుటకు అన్ని వర్గాల ప్రజల సహకారంతో నియంత్రించుకుంటూ, ప్రజా ఆరోగ్యాన్ని రక్షిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లోఏ.ఎస్.అర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్,ప్రతిభ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గిరిగాని సుదర్శన్,స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్,సంస్థల సభ్యులు వెంకటస్వామి,తంగెళ్ల రవికాంత్ లు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన ములుగు జిల్లా కళాకారులు






**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి ):** ములుగు మున్సిపాలిటీలో మొట్టమొదటి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన చింతనిప్పుల చంద్రకళ బిక్షపతిని జిల్లా కళాకారులు కలిసి పుష్పగుచ్ఛం,శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లాకళాకారుల సంఘం నాయకుడు గోల్కొండ బుచ్చన్న మాట్లాడుతూ..మొదటి నుండి ములుగు ప్రాంత కళాకారుల పట్ల స్నేహ పూర్వకంగా ఉంటూ కార్యక్రమాలకు తన వీలైన సహాయాన్ని అందించేవాడని మానవత్వం ఉన్న నాయకుడు చింతనిప్పుల బిక్షపతి అని అన్నారు. మంత్రి సీతక్కతో గత 25 సంవత్సరాల నుండి విశ్వాసంగా ఉంటూ మానవ సంబంధాలను పెనవేసుకున్న ప్రజా నాయకుడు చింతనిప్పుల చంద్రకళ బిక్షపతిని గుర్తించి మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నుకున్నందుకు మంత్రి సీతక్కకు జిల్లా కళాకారులు ధన్యవాదాలు తెలిపారు.చారిత్రక ప్రాంతమైన ములుగు జిల్లా కేంద్రంలో చేపట్టబోయే కళా కార్యక్రమాలకు,జిల్లాలోనికళాకారులకు సహకరిస్తారని ఆశభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు గోల్కొండ బుచ్చన్న,వావి లాల రాంబాబు,రాగుల శంకర్,పోరిక సామ్యూల్ నాయక్,పోలెపాకయాకయ్య, ఎండి రహీముద్దీన్,వడ్లాల మల్లేష్ యాదవ్,కొడిమల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా ఉండడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

- పరుపాటి శ్రీనివాసరెడ్డి



**రాయపర్తి,ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలోనిరుపేద కుటుంబనికి చెందిన కాంచనపల్లి రేణుక ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసినఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డిఈ సహాయంను వారి కుటుంబనికి అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి మరియు వార్డ్ నెంబర్ లు గాడిపెల్లి రాములు, తాటికాయల కేతమ్మ, పార్టీ ముఖ్య నాయకులు గబ్బేట కొమురయ్య, సంకినేని ఎల్లస్వామి, చిర్ర బిక్షపతి, గాడిపెల్లి ఉప్పలయ్య పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి 50వేల విరాళం అందించిన ఎస్ఆర్ఆర్ చైర్మన్ శ్రీనివాసు రెడ్డి



**రాయపర్తి ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరుకవేడు గ్రామంలోస్థానిక క్రిస్టియన్ సోదరుల విన్నపం మేరకు చర్చి నిర్మాణ పనులకు ఆర్థిక సహాయం కోరగా వెంటనే స్పందించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశం మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50,000 రూపాయలు ఆర్థిక సహాయం (విరాళం) అందచేసినఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డి . ఈ కార్యక్రమం లో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్ గజవెల్లి ప్రసాద్ సంకినేని ఎల్లస్వామి, చందు రాము, భాషబోయిన ఎల్లయ్య,గ్రామ స్థానిక నాయకులు అయిన గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మెరా విరస్వామి, మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు, మాజీ ఎంపీటీసీ బండి రాజబాబు పార్టీ ముఖ్య నాయకులు భాషబోయిన సుధాకర్, మంగిశెట్టి రాజు, ఆకారపు దేవంద్ర చారి, మాకినేని కిట్టూరావు, ఆకుల సమ్మయ్య, బండి నరసయ్య బొమ్మెరా రాజు, ఉగ యాకుబ్, ఉగ మల్లెయ్య, పండుగ రామానుజం, ఉగ సతీష్, ఉగ ఉమేష్, ఉగ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో మంటల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై అవగాహన సదస్సు



**టేకుమట్ల ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి న్యూస్** మండలం లోని బోర్నపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ డాక్టర్ నేరెళ్ల రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఆఫీసర్ (డివైఆర్ఓ) రత్నజ్యోతి,మరియు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పద్మ మరియు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్టల పై వున్న చెట్లను నరికివేయరాదు, మూగజీవలను చంపరాదు,వేసవిలో గుట్టలు అడవులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ఘనంగా సైన్స్ సంబరాలు



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఫిబ్రవరి 28)** మండలంలోని కొరికిశాల మోడల్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్, పోస్టర్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేష్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. శాస్త్రం మన జీవితాన్ని అభివృద్ధి చేసే శక్తివంతమైన సాధనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులు, రామకోటేశ్వర్,శ్రీకాంత్, వినయ్ కుమార్,రాజ్ కుమార్, రమ లు క్విజ్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్, ప్రయోగాల ప్రదర్శనలు నిర్వహించగా విద్యార్థులు రంగోలి లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోజేర్వు పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు




**చెన్నారావుపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండలంలోని బోజేర్వు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎంపీయుపిఎస్ లో శనివారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నోబెల్ బహుమతి గ్రహీత, భారతరత్న సర్ సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్ర రవీందర్, ఉపాధ్యాయ బృందంతో కలిసి సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను, మూఢనమ్మకాలను పారద్రోలడంలో శాస్త్రీయ ఆలోచనా విధానం ఎంత అవసరమో విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశోధనాత్మక ఆలోచనలు అలవరుచుకోవాలని, కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలాన్ని పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్, రమేష్, రాజు, వెంకటేశ్వర్లు, విజేందర్, శ్వేతా శ్రీ, పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- **2, 7 డివిజన్లను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి.**





**వర్ధన్నపేట, ఫిబ్రవరి 28, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట పట్టణంలోని 2వ మరియు 7వ డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి శుక్రవారం ఉదయం ప్రత్యేక పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజుఆదేశాల మేరకు జరిగింది. పర్యటన సందర్భంగా డివిజన్లలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన చైర్మన్ సారంగపాణి మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి మోరీలను శుభ్రం చేయించి, వాటి చుట్టూ పెరిగిన చెట్లను తొలగింపజేశారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించి, శుభ్రత కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలకు చెత్త బండి సకాలంలో అందుబాటులో ఉందా లేదా అన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన చైర్మన్, సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. పట్టణ ప్రజలు లేదా మున్సిపాలిటీ సిబ్బంది ఎవరైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రంగాలలో సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని చైర్మన్ సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కౌన్సిలర్ బెజ్జం పాపారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్, శివరాత్రి నర్స్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**టేకుమట్ల ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి న్యూస్** టేకుమట్ల మండలం లోని ఇటీవల మరణించిన వారు దుబ్యాల గ్రామం లో మాజీ ఎంపీటీసీ బిక్కినేని సంపత్ రావు తండ్రి బిక్కినేని మెటల్ రావు,అరుముల్ల తిరుమల అనారోగ్యం తో మరణించినారు. వేల్లంపల్లి గ్రామంలో గంపల రాజయ్య, బండపల్లి గ్రామంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రాగిడి రాజిరెడ్డి ఇటీవల మరణించినారు. మృతుల చిత్ర పటానికి పూలమాల వేసి నివాలు అర్పించి వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు . ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్.మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి.వివిధ గ్రామల సర్పంచులు.మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



**చెన్నారావుపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్లో శనివారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై రాజేష్ రెడ్డి, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై మక్కువ పెంచుకుని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలనీ,ప్రతి విద్యార్థి నూతన టెక్నాలజీ రూపకల్పనపై దృష్టి సారించి, మెదడుకు పదును పెట్టే ఆలోచనలు చేయాలనీ,నేటి పోటీ ప్రపంచంలో సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అండెం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు దామర గణేష్, బొజ్జ విజయ్, వైనల రాజు, నామాల సృజన, మేడి రమేష్ గౌడ్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడిలో మెరుగైన విద్య నాణ్యమైన పౌష్టికాహారం

- **సర్పంచ్ చాట్ల విజయ రవీందర్**



**ప్రజాజ్యోతి– మొగుళ్ళ పల్లి (ఫిబ్రవరి 28)** మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుందని సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ అన్నారు. శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో. ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ECCE) కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్వాడి కేంద్రంలో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం పిల్లలకు అందించడం జరుగుతుందని ప్రభుత్వం బాలింతలకు, గర్భిణి స్త్రీలతో పాటు మూడేళ్ల చిన్నారులకు. పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.తల్లిదండ్రుల ప్రమేయంతో తమ పిల్లల అభివృద్ధి పురోగతి గురించి చర్చించడానికి ప్రారంభ విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడానికి అంగన్వాడి కేంద్రం చక్కటి వేదికన్నారు. విద్యార్థులకు ఆట పాట కథ పూర్వ గణిత భావన సృజనాత్మక శాస్త్రీయ పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని ఆటపాటలతో అందించిన విద్య వల్ల పిల్లలు శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సెంటర్ –1టీచర్ బి. అనిత, ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు కోటేశ్వర రావు, వార్డు మెంబర్లు. గుడిమల్ల జయసుధ రమేష్, అర్షం మహేష్, అంగన్వాడి టీచర్, బాలింతలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## మహమ్మద్ రంజాన్ భౌతిక దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నాగరాజు.



**వర్ధన్నపేట, ఫిబ్రవరి 28, ప్రజా జ్యోతి** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, కట్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అక్బర్ తండ్రి మహమ్మద్ రంజాన్ అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నాగరాజు శనివారం వారి నివాసానికి వెళ్లి మహమ్మద్ రంజాన్ భౌతిక దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాగ్దేవి కళాశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు

- ఉత్సాహభరితంగా ప్రాజెక్ట్ ఎక్స్పో "జిజ్ఞాస 2026"







**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి):** నగరంలోని బొల్లికుంటలో గల వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని "జిజ్ఞాస 2026" శీర్షికతో విజ్ఞానోత్సాహభరితంగా ప్రాజెక్ట్ ఎక్స్పో నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విజ్ఞాన ప్రాధాన్యతను పెంపొందించడంతో పాటు సృజనాత్మక ఆలోచనలకు వేదికగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. సిహెచ్. వాణి దేవి (డైరెక్టర్), డా. కె. ప్రకాశ్ (ప్రిన్సిపాల్), డా.ఎం. శశిధర్ (ప్రిన్సిపాల్), డా. కె. తిరుపతి రావు (వైస్ ప్రిన్సిపాల్) హాజరై తమ ఆలోచనలతో విద్యార్థులను ప్రేరేపించారు. అలాగే డా. కె. రాజేష్ ఖన్నా (కన్వీనర్), డా. డి. నాగరాజు (కోఆర్డినేటర్), డా. చి. సునీత (కోఆర్డినేటర్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం డా. దేవేందర్ రెడ్డి, డా. వాణి, డా. వాహిని పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పోలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. సాంకేతిక, సామాజిక, పర్యావరణ అంశాలకు సంబంధించిన పలు నమూనాలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత మరియు సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని ఈ సందర్భంగా వక్తలు తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించగా, న్యాయనిర్ణేతలు ప్రాజెక్టులను సమీక్షించి ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. "జిజ్ఞాస 2026" కార్యక్రమం విజ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి, పరిశోధనా ఆత్మను పెంపొందించడానికి మరియు యువతలో ఆవిష్కరణ భావనను పెంచడానికి ఒక ఉత్తమ వేదికగా నిలిచి విజయవంతంగా ముగిసింది.

# మేరు కులస్తులను బి.సి (ఎ) లో చేర్చాలి

- మండల మేరు సంఘం అధ్యక్షులు కీర్తి రాజ్ కమల్
- మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు




**పాలకుర్తి, ఫిబ్రవరి 28, (ప్రజాజ్యోతి) :** కుట్టు మిషన్ వృత్తి దారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మేరు కులస్తులను బి.సి (ఎ) లో చేర్చాలని మేరు సంఘం పాలకుర్తి మండల అధ్యక్షులు కీర్తి రాజ్ కమల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 28 తేదీ కుట్టు మిషన్ సృష్టి కర్త ఎలియాస్ హోవే జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం టైలర్స్ డే వేడుకలను పాలకుర్తి మండల కేంద్రంలోని మేరు సంఘం భవనంలో ఏర్పాటు చేయగా కీర్తి రాజ్ కమల్ మేరు కుల దైవం శ్రీ శ్రీ శ్రీ జగిరి శంకర దాసమయ్య, ఎలియాస్ హో చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో కుట్టు మిషన్ వృత్తి పై ఆధారపడిన మేరు కులస్తుల జీవనం రెక్కాడితే డొక్కాడని విదంగా అగమ్యగోచరంగా మారిందని, రెడిమేడ్ దుస్తుల పరిశ్రమలతో బతుకు కుదేలై చాలీ చాలని పనులతో కొట్టుమిట్టాడుతున్న మేరు కులస్తులకు ప్రభుత్వం కమీషన్ ను ఏర్పాటు చేయాలని, తిరిగి చెల్లించని ఋణాలను, వడ్డీ లేని ఋణాలను, అందించాలని, ప్రతి కుంటుంబానికి ఆటో మెటిక్ జుకీ మిషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ వెంకన్న, సోమ సత్యం, కీర్తి యాదగిరి, కీర్తి రవి, జిల్లా సహాయ కార్యదర్శి మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ వాసు, మండల సహాయ కార్యదర్శి గూడూరు లెనిన్ , సంగ వెంకటేశ్వర్లు, గూడూరు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# 'అభ్యాస' లో అబ్బుర పరిచిన జాతీయ సైన్స్ ఫేర్



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి):** నగరంలోని శంభునిపేట గణేష్ నగర్ లోనీ అభ్యాస స్కూల్ లో షూ జాతీయ సైన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ చేతులమీదుగా సైన్స్ డే ను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ మనిషి జీవన విధానానికి సైన్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, శాస్త్రవేత్తలు ఎక్కడో ఉండరని పాఠశాల స్థాయి నుండే వస్తారని అన్నారు. విద్యార్థులు తమ మేథో సంపత్తితో కష్టపడి తయారు చేసిన ప్రయోగాలను చూసి వారిని అభినందించారు. ఆకర్షణీయ ప్రాజెక్ట్స్ ను తయారు చేయటంలో గైడెన్స్ ఇచ్చిన సైన్స్ టీచర్స్ ను, సహకరించిన పేరెంట్స్ ను అభినందించారు. ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ సైన్స్ ప్రాజెక్ట్స్ తయారు చేయడం వలన విద్యార్థిలలో దాగిఉన్న ప్రతిభ బయటపడి ఉన్నత స్థాయికి ఎదగడంలో ఉపయోగపడుతుందని అన్నారు. దాదాపు 250 ప్రాజెక్ట్స్ తయారు చేసిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ రెహమత్ మేడం అభినందించారు. న్యాయ నిర్ణేతలు సంతోష్, ప్రియాంక లు 20 ఉత్తమ ప్రాజెక్ట్స్ ను ఎంపిక చేసి పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జి కోల రాము, ఉపాధ్యాయులు షబ్బీర్, ప్రణయ్, భారతి, సృజన, స్వాతి, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# సంఘమిత్ర హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి):** నగరంలోని దేశాయ్‌పేట్ రోడ్డులోని సంఘమిత్ర హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డి. మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా నోబెల్ బహుమతి గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త సి వి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ, 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ ద్వారా కాంతి పరిక్షేపణ సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప శాస్త్రవేత్త సి.వి. రామన్ అని పేర్కొన్నారు. భౌతిక శాస్త్రంలో చేసిన విశిష్ట సేవలకు గాను ఆయన 1930లో నోబెల్ బహుమతిని అందుకున్నారని తెలిపారు. దేశంలో సైంటిఫిక్ టెంపర్, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. ప్రిన్సిపాల్ మహేందర్ మాట్లాడుతూ, సైన్స్‌కు జీవితాంతం అంకితమైన మహనీయుడు సి.వి. రామన్ ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ల్యాబర్తి ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం.




**వర్ధన్నపేట, ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ ల్యాబర్తి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వేణు కుమార్ ఆధ్వర్యంలో, సైన్స్ ఉపాధ్యాయులు పోగుల నాగరాజు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. భారత మహా శాస్త్రవేత్త సి.వి. రామన్ ఆవిష్కరణ అయిన రామన్ ఎఫెక్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, మోడల్స్ మేకింగ్, సైన్స్ ప్రదర్శనలు, ప్రయోగాలు, సైన్స్ క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. జీవశాస్త్ర విభాగంలో వివిధ వర్కింగ్ మోడల్స్, బ్లడ్ గ్రూప్ టెస్ట్, సూక్ష్మదర్శిని ప్రయోగాలు, స్పెసిమెన్స్ ప్రదర్శన, డ్రాయింగ్ చార్ట్స్ ఏర్పాటు చేశారు. భౌతిక శాస్త్ర విభాగంలో గాలి ఒత్తిడి (ఎయిర్ సైడ్), ఆమ్లాలు–క్షారాలు గుర్తించడం, విద్యుత్ మరియు దండాయిస్కాంతం ద్వారా అయస్కాంత క్షేత్రం ఏర్పడడం వంటి ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండల ప్రజాపరిషత్ ప్రతినిధులు, ల్యాబర్తి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అలాగే గాంధీ విద్యామందిర్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు హాజరయ్యారు. తదనంతరం నిర్వహించిన సమావేశంలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ప్రదీప్ రావు

**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో ఇటీవల సీనియర్ బీజేపీ కార్యకర్త మర్రి వీరాస్వామి అనారోగ్యం కారణంగా మరణించాడు. అట్టి కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచారు బీజేపీ రాష్ట్రనాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు. శనివారం మర్రి వీరస్వామి నివాసానికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేసి అండగా ఉంటానని భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షులు కందిమల్ల మహేష్, ఖిలా వరంగల్ మండల అధక్షులు తాళ్లపెల్లి అర్జున్, బీజేపీ జిల్లా నాయకులు బక్కి రంజిత్, అరె కార్తీక్, చాపల నాగరాజు, ధారబోయిన అనిల్, ఆడుప మల్లేశం, కిరణ్, విజయ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## కొనాపురం లక్ష్మీనరసింహ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సర్పంచ్ మైదం రాకేశ్



**చెన్నారావుపేట ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి):** మండలంలోని కొనాపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మైదం రాకేశ్, కల్ నాయక్ తండా సర్పంచ్ తిరుపతితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. స్వామివారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రాములు,లింగాపురం సర్పంచ్ పురం రాంబాబు ఉప సర్పంచ్ మండల నర్సింహారావు,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, మచ్చిక కుమారస్వామినాయకులు గోవింద్ నాయక్, పురం మల్లయ్య, కీసరి రమేష్, కల్లెపు రవి,వార్డు సభ్యులు లింగస్వామి, పోతరాజు రాజు, అన్నెబోయిన రాకేశ్, కల్లెపు శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్,దేవస్థానం కమిటీ సభ్యులు మండల అనిల్, హంస భద్రయ్యలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## గ్రామం లోని సమస్యలన్నిటిని పరిష్కరిస్తా

- సర్పంచ్ సంగి అంజలి




**టేకుమట్ల ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి న్యూస్** మండలంలోని దుబ్యాల గ్రామం లో శనివారం స్థానిక సర్పంచ్ సంఘీ అంజలి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా వీధిలైట్లు, పారిశుధ్యం,మంచినీటి సరఫరా తదితర అంశాలపైచర్చించారు. అనంతరం సర్పంచ్ సంగి అంజలి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనిసూచించారు.గ్రామ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు గ్రామపంచాయతీ సిద్ధంగా ఉందని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.గత రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన సైడ్ కాలువల్లోని మట్టిని గ్రామసభ అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది చే తొలగించి సైడ్ కాలవలను శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి వార్డ్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎగ్ కార్డుల పంపిణీ



**పర్వతగిరి, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండల కేంద్రంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఎన్ఈసీసీ (నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ) సౌజన్యంతో పర్వతగిరి, వర్ధన్నపేట, అయినవోలు మండలాలకు చెందిన నిరుపేదలకు 30 ఎగ్ కార్ట్ స్టాల్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఈ తరహా ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎగ్ కార్ట్ స్టాల్స్ ద్వారా లబ్ధిదారులు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ పోషణకు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. ఎన్ఈసీసీ ప్రతినిధి ఎర్రబెల్లి వినీత్ రావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ యస్ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు ,పిఎసియస్ మాజీ చైర్మన్ మోటాపోతుల మనోజ్ గౌడ్,మాజీ ఎంపిటిసి మాడుగుల రాజు, మాజీ మండల అధ్యక్షులు ఏడుదోడ్ల జీతెందర్ రెడ్డి, మాజీ ఎంపిపి రజీత కుమారస్వామి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచల రామయ్యకు గొటి కోటి తలంబ్రాలు



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి28** గణపురం మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో భద్రాచల రామయ్యకు భక్తితో గోటి కోటి తలంబ్రాల కార్యక్రమం శనివారం ప్రారంభించారు. శ్రీ రామదాసు సేవ సమితి ఆధ్వర్యంలో మొదలైన ఈ కార్యక్రమానికి గురువారం నాటికి 21 రోజులు పూర్తయ్యాయని జిల్లా బాధ్యులు ఆకుల సుభాష్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరాల నుంచి భద్రాచలం సీతారాముల కల్యాణానికి గోటితో కోటి తలంబ్రాలు పంపిస్తున్నారు. ఈ సంవత్సరం భుపాలపల్లి జిల్లాతో పాటు హన్మకొండ, ములుగు జిల్లాల నుంచి కూడా భారీగా చేపట్టారు. ప్రతిరోజూ భక్తులు సమిష్టిగా భక్తిభావంతో తలంబ్రాలు కార్యక్రమం సాగిస్తున్నారు. శ్రీ రామదాసు సేవ సమితి, శ్రీ రామదాసు భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆరెందాల లలిత శంకరయ్య, సేవ సమితి అధ్యక్షులు బెనికి రాజేందర్, ఉపాధ్యక్షులు పనికెలా శివకృష్ణ, భజన మండలి అధ్యక్షులు ఆకుల దామోదర్, ఉపాధ్యక్షులు దూలం శంకర్, మహిళా సేవ సమితి అధ్యక్షులు పనికేలా వసంత, ఉపాధ్యక్షులు జీడీ స్వర్ణలత, సమితి సభ్యులు గందే శ్రీనివాస్, సింగం రాజవిరు, పాలకుర్తి సాంబయ్య, దూలం రమేష్ నారగని రమ కరుణ కడారి సూరమ్మ పాల్గొన్నారు.

## పరీక్షల సమయంలో మనోధైర్యం కోల్పోవద్దు

- చెన్నారావుపేట తహశీల్దార్ అబిద్ అలీ.



**చెన్నారావుపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి )** విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండా, పట్టుదలతో ముందుకు సాగాలని చెన్నారావుపేట తహశీల్దార్ అబిద్ అలీ అన్నారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు చిట జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచించారు.ఏ ఒక్క విద్యార్థి కూడా భయంతో ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదని, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా మనోధైర్యంతో ఎదుర్కోవాలని హితవు పలికారు. పేదరికం లేదా ఆర్థిక ఇబ్బందులు చదువుకు ఆటంకం కాకూడదని, వాటిని ఎలా అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.అనంతరం, విద్యార్థులు పాఠశాలలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ ఐ రషీద్,పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ నేతాజీ పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవం




**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి28** గణపురం మండలంలోని బస్వరాజు పల్లి గ్రామంలోని శ్రీ నేతాజీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉడుత సాంబయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ సైన్స్ ఫేర్ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను ప్రోత్సహించడం వల్ల విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారనివారు తయారు చేసిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయని. ప్రతి విద్యార్థి తన ప్రాజెక్టు పై స్పష్టంగా వివరించి సందర్శకుల ప్రశంసలు పొందారని సాంబయ్య యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బస్వరాజు పల్లి సర్పంచ్ చింతకుంట్ల సునీత శ్రీనివాస్, ధర్మ రావు పేట సర్పంచ్ పూజారి రాజేందర్ గౌడ్ లు హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. శాస్త్రం దేశ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు పాఠశాల విద్యార్థులను అభినందించి విజేతలకు బహుమతులను అందజేశారు.



## ఎంజీఎం పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి28** గణపురం మండలం చెల్పూర్ ఎంజీఎం పాఠశాలలో భారతదేశ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సి. వి. రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ రోజు ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను జరుపుకుంటారు అందులో భాగంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థిని విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ నిర్వహించింది.రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఎగ్జిబిట్ తో సహా నూతన పోకడలు కలిగిన వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లు, సైన్స్ నాటికలు, సైన్స్ సంతలు ,వివిధ రకాల నృత్య ప్రదర్శనలు నిర్వహించి ఆద్యంతం పాఠశాల ఆవరణలో సర్వాంగ సుందరంగా సైన్స్ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ నేటి ప్రస్తుత పరిస్థితుల్లో మనిషికి, సైన్స్ కు అవినాభావ సంబంధం ఉందని ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక విషయాలపట్ల సద్భావన కలిగి ఉండి సమాజానికి ఉపయోగపడే సమస్యల సాధనను సైన్స్ పరిజ్ఞానంతో ఆవిష్కరించి కొత్త ఒరవడిని సృష్టించి గొప్ప శాస్త్రవేత్తలు కావాలని భారత దేశ ఔన్నత్యాన్ని నలుమూలలా తెలియజేయాలని అందుకు పాఠశాల నుండే బీజం పడాలని ,సైన్స్ పట్ల మక్కువ పెంచుకొని ఉన్నత విలువలు పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి , గ్యాదంగి రమాదేవి ,సిలువేరు శ్రీనివాస్ ప్రిన్సిపల్ మధుకర్, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు చిర్ర యాకేష్,కావ్య, సంతోష్, శ్రీవిద్య ఇతర ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సమర్పించిన నివేదిక ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బ

- పీ ఆర్ టీ యూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన




**కన్నాయిగూడెం, ఫిబ్రవరి 28(ప్రజాజ్యోతి) :** తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి సమర్పించిన నివేదిక ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని, ఆ నివేదికకు నిరసనగా కన్నాయిగూడెం మండలంలో పీ ఆర్ టీ యూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వతాల సతీష్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పర్వతాల సతీష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన కన్నాయిగూడెం మండలంలో బహుళ తరగతి బోధన గావిస్తున్నామని పిల్లల విద్యా ప్రమాణాలను పెంపొందించుటలో తాము శాయశక్తుల కృషి చేస్తున్నామని, పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు 18 సబ్జెక్టులను బోధించడం, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి మేము కృషి చేస్తున్నామని, ఉపాధ్యాయ బోధనను చులకన చేసే విధంగా ఆకునూరి మురళి నివేదిక ఉందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అసోసియేటివ్ అధ్యక్షులు అమీరిశెట్టి సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షులు దయ రాజు, రమేష్, జిల్లా మీడియా సెక్రెటరీ పులి రామేశ్వరం, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు జె.ప్రజ్ఞ, నిరసన తెలియజేస్తూ ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువ అనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నిరసన తెలియజేసారు.

# సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ

- జిల్లా ఫస్ట్ ర్యాంక్, స్టేట్ 4వ ర్యాంక్ తో చిందం గౌతమ్ ప్రభంజనం



**మల్హర్ ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మల్హర్రావు మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన చిందం గౌతమ్ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (AIS-SEE) 2026 ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పరీక్షలో గౌతమ్ రికార్డు స్థాయి ర్యాంకులతో గ్రామానికి మరియు జిల్లాకు గర్వ కారణంగా నిలిచారు.

**ముచ్చటగా మూడు అగ్రశ్రేణి ర్యాంకులు:**

కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న గౌతమ్, తన కఠిన శ్రమతో మూడు స్థాయిల్లోనూ అత్యుత్తమ ర్యాంకులు సాధించారు: జిల్లా స్థాయిలో: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే మొదటి (1st) ర్యాంక్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. రాష్ట్ర స్థాయిలో: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 4వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో: ఆల్ ఇండియా లెవల్‌లో 240వ ర్యాంక్ సాధించి తన మేధస్సును చాటారు.

**తల్లిదండ్రులు మరియు పాఠశాల హర్షం:**

తాడిచర్ల గ్రామానికి చెందిన చిందం భాస్కర్ – హాసిని దంపతుల కుమారుడైన గౌతమ్, చిన్నతనం నుంచే చదువులో చురుగ్గా ఉంటూ ఈ ఘనత సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గౌతమ్ విజయం పట్ల ఆదర్శ హైస్కూల్ కరెస్పాండెంట్ కార్తీక్ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయి పరీక్షల్లో అగ్రస్థానంలో నిలవగలరని గౌతమ్ నిరూపించాడని ఆయన కొనియాడారు.

# ముగిసిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్.



**భూపాలపల్లి టౌన్,ప్రజాజ్యోతి, ఫిబ్రవరి 28.** కేంద్ర ప్రభుత్వం మేర యువ భారత్ వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు మండలాల్లో బ్లాక్ లెవెల్లో సెలెక్ట్ అయిన వారికి భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియం క్రీడా ప్రాంగణంలో క్రీడలు నిర్వహించి ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెల్దండ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిలుగా విచ్చేసినటువంటి సున్నమిత్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ గా మరియు ఎస్ జి ఎఫ్ సెక్రటరీ జైపాల్ మరియు ఎస్ జి ఎఫ్ ప్రెసిడెంట్ రమేష్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంది అందరు కూడా క్రీడల పట్ల అవగాహన కలిగి ఉండాలి. విద్యార్థి దశలో క్రీడలతో తో అభివృద్ధి సాధించవచ్చని మాట్లాడడం జరిగింది ఈవెంట్స్ లో విజేతలకు బహుమతులు. పురుషులకు కబడ్డీ (7 సభ్యుల టీం) మహిళలకు టగ్ ఆఫ్ వార్ / తాడు గుంజే ఆట (8 సభ్యుల టీం) వ్యక్తిగత ఈవెంట్ లు: 3 & 4. పురుషులు మరియు మహిళలకు అథ్లెటిక్స్ (100 మిటర్స్ పరుగు పందెం) 5 & 6. పురుషులు మరియు మహిళలకు బ్యాడ్మింటన్ (షటిల్ సింగిల్స్) ఈవెంట్స్ అర్హత సాధించిన యువతి, యువకులకు సర్టిఫికెట్స్ మెమొంటోస్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ గారు మరియు జ్యోతి గారు మరియు మేరా యువ భారత్ కోఆర్డినేటర్ వెల్దండ సురేష్ గారు పి.ఈ.టిల గారు మరియు యువతి యువకులు మరియు క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

# కెటిపిపి చీఫ్ ఇంజనీర్ చిట్టాప్రగఢ ప్రకాష్ కలిసిన టీ ఆర్ వి కె ఎస్ హెచ్ -58 యూనియన్





**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి28** గణపురం మండలం చెల్పూర్ లో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీ ఆర్ వి కే ఎస్ ) హెచ్ 58 కి కాలనీలో యూనియన్ కార్యాలయాన్ని కేటాయించి నందుకు యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కోడూరి ప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు కె.వి. జాన్సన్ ,చారుగుండ్ల రమేష్, జెన్ కో అధ్యక్షులు ఎలకంటి రగోత్తం గార్లు కృతజ్ఞతలు తెలుపుతూ, కెటిపిపి లో పని చేస్తున్న ఓ & ఎం మరియు ఆర్టీజన్ కార్మికుల కు సంభందిచిన పలు సమస్యలు, డోజర్ ఆపరేటింగ్ సిబ్బంది మరియు కోల్ హ్యాండ్లింగ్ మరియు సివిల్ లో పని చేస్తున్న సమస్యలు గూర్చి, ఆర్టిజజన్స్ యొక్క క్యాంప్లిషన్, షిఫ్ట్ మరి) డస్ట్ అలవెన్స్ గురించి అడగ్గా ఇట్టి సమస్యలపై చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరింపచేయడం జరుగుతుందని తెలిపారు. మీ యూనియన్ పక్షాన విన్నవించిన పలు సమస్యలు పరిష్కారం చేస్తున్నాను, ఇంకా చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు పుట్టపాక కిరణ్ గారి తండ్రి గారు ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈకార్యక్రమంలో రిజనల్ అధ్యక్ష,కార్యదర్శులు లింగంపల్లి రాజేశ్వరరావు ,సూర నరేందర్ రాష్ట్ర కమిటీ సభ్యులు జెన్ కో కమిటీ సభ్యులు సంఘసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజలు



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి28** గణపురం మండల కేంద్రం లో కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతినెల గ్రామదేవతలకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలి :: కె రవి కుమార్




**మల్హర్, ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి** మండలంలోని దుబ్బపేట కెజీబీవి బాలికల పాఠశాలను శనివారం తహసీల్దార్ కె రవి కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని వీక్షించడంతో పాటు సైన్స్ ల్యాబ్ నిర్వాహనను మరియు విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అమలవుతోందో లేదో నిర్ధారించుకున్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శిల్పారామం విజ్ఞాన ప్రదర్శనలో మోడల్ విద్యార్థులు



**మల్హర్, ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని ఉప్పల్ మినీ శిల్పారామం హాల్ లో రోబోటిక్ ఇన్ అకాడమిక్స్ పేరిట నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో బాగంగా గత నెల రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి నుండి 9 వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు రోబోటిక్స్ లో శిక్షణ ఇచ్చి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఐదవ వార్షిక రోబోటిక్స్ ఎగ్జిబిషన్ మినీ శిల్పరామంలో పాల్గొనే అవకాశం కల్పించారు. కార్యక్రమంలో మంచి ప్రతిభ కనపరచిన 9వ తరగతి చదువుతున్న ఎడ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఓడేటి ప్రణీత్ కుమార్, చాట్లపల్లి శ్రీనిధి స్మార్ట్ ఇరిగేషన్ అనే ప్రాజెక్టు రూపొందించి ఎగ్జిబిషన్లో పాల్గొన్నగా గైడ్ టీజర్ గా కర్రె అశోక్ వ్యవహరించారు . స్మార్ట్ ఇరిగేషన్ అనే ప్రాజెక్ట్ రూపొందించి ఎగ్జిబిషన్ లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచందర్రావు ఉపాధ్యాయ బృందం, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ అభినందించారు.

## భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి సమగ్ర చర్యలు తీసుకోవాలి

- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి):** జయశంకర్ భూపాలపల్లి పట్టణ అభివృద్ధిపై నూతన పాలక వర్గం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశలో తీసుకువెళ్లాలనే అభిప్రాయంతో జిల్లా పద్మశాలి సంఘం నాయకులు నూతన మున్సిపల్ పాలకవర్గాన్ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీమనాదుని సత్యనారాయణ ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీను ని వారి కార్యాలయంలో కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి మరిన్ని నిధులు సమకూర్చేలా కృషి చేయాలని కోరారు. పట్టణాన్ని అభివృద్ధి పరంగా రాష్ట్రంలో ప్రత్యేక స్థానంలో నిలిపేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, భూపాలపల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న కోతుల బెడద, వీధి కుక్కల సమస్య, డ్రైనేజీ లోపాలు, రోడ్ల దుస్థితి వంటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోనె భాస్కర్, భాగవతం బిక్షపతి, షేర్ కుమార్, పాసిగంటి శ్రీనివాస్, కుసుమ రాజయ్య, పినుమళ్ళ రమేష్, మామిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచం టైలర్స్ డే

- టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్




**నర్సంపేట ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** నర్సంపేటలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాలా ఘనంగా నిర్వహించిన టైలర్స్ డే సందర్భంగా జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపిన టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్ అనంతరం వారు మాట్లాడుతూప్రపంచ టైలర్స్ డేకుట్టు కళకు గౌరవం తెలిపే ప్రత్యేక దినోత్సవంమన రోజువారీ జీవితంలో దుస్తులు ఎంత అవసరమో చెప్పనక్కర్లేదు.కానీ ఆ దుస్తులు మనకు అందంగా,సౌకర్యంగా తయారయ్యే వెనుక ఉన్న శ్రమను మనం చాలాసార్లు గమనించము. ఆ శ్రమకు ప్రతీకగా నిలిచే వ్యక్తి టైలర్ (దర్జీ). కుట్టు కళను వృత్తిగా చేసుకుంటూ, మన అవసరాలకు తగినట్లుగా దుస్తులను రూపొందించే టైలర్లకు గౌరవం తెలపడానికి జరుపుకునే ప్రత్యేక దినమే టైలర్స్ డే (Tailors Day).ఆధునిక కాలంలో టైలర్ల పాత్రఈరోజుల్లో రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉన్నప్పటికీ, కస్టమ్ టైలరింగ్కు ప్రత్యేక గుర్తింపు ఉంది.మన శరీరానికి సరిపోయే విధంగా కుట్టించిన దుస్తులు వేసుకోవడం వల్ల కలిగే సౌకర్యం వేరే స్థాయిలో ఉంటుంది.ఆధునిక టైలర్లు కేవలం కుట్టు పనికే పరిమితం కాకుండా:ఫ్యాషన్ డిజైన్ ప్యాటర్న్ మేకింగ్ ఎంబ్రాయిడరీస్టైలింగ్ సూచనలుఇవన్నీ అందిస్తున్నారు.అందుకే టైలర్స్ డే అనేది ఈ నైపుణ్యాలన్నిటినీ గౌరవించే రోజు అన్నారు .ఈ కార్యక్రమంలో ట్రైలర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రామగిరి రవి,పైతర్ వెంకటేష్,ప్రధాన కార్యదర్శిలు న్యాతిని రవి, కోశాధికారి రామగిరి రవి, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, కమిటీ సభ్యులు కర్ణ కృష్ణ, మధు, సంగ సత్యనారాయణ, సాయి బాబా, గట్ల రాంచందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి





**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి**

మండల కేంద్రంలో నీ ఐ టీ ఐ అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను శనివారం ఏటూరూ నాగారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ హైస్కూల్, జకారంకు చెందిన70 మంది విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పురసరించుకొని ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పిచ్చి రెడ్డి యాదగిరీ ప్రధానోపాధ్యాయులు ఎస్. జగన్ మోహన్ రెడ్డి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు మువీన్ కుమార్ ఏ టి ఓ.జె. నరేష్ సమన్వయం చేశారుసీనియర్ అసిస్టెంట్లు ఎం.డి.సాదిక్,విక్రమ్ జూనియర్ అసిస్టెంట్లు ఎ. సమ్మయ్య, కె. కొండయ్య ఆఫీస్ ఇబ్బంది పి శ్రీనివాస్ వి కృష్ణ ప్రసాద్ కె వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ప్రత్యేకంగా .ఏ టి సి.బోధనా సిబ్బంది ఎం.డి.గౌస్, అరవింద్, పవన్ కళ్యాణ్, రాంబాబు, శ్రావ్య, దీపక్, గణేష్, హరీష్ ఆధునిక యంత్రాల గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు.ఈ పర్యటన ద్వారా విద్యార్థులు సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలు. నైపుణ్యాభివృద్ధి గురించి అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది అని ప్రిన్సిపాల్ . యస్ జగన్మోహన్ రెడ్డి తదితరులు తెలిపారు.సైన్స్ పై అవగాహన పెంచుకోవాలిసర్పంచ్ కావిరి అర్జున్ ప్రతి ఒక్కరూ సైన్ పై అవగాహన పెంచుకోవాలినీ రోహిరు గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు. ఇప్పలగూడెం పాఠశాలలో సైన్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో రోహిరు గ్రామంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించడం.అభినందనీయం అన్నారు.జాతీయ విజ్ఞాన దినోత్సవం ఫిబ్రవరి 28న విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞాన చైతన్యం, పరిశోధనాసక్తి పెంపొందించేందుకు పాఠశాలలో నిర్వహించామని తెలియజేశారు. సి. వి. రామన్ 1928 ఫిబ్రవరి 28న "రామన్ ఎఫెక్ట్" అనే గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణ చేశారనీ అన్నారు. ఈ ఆవిష్కరణకు గాను ఆయనకు 1930లో నోబెల్ బహుమతి లభించిందనీ, భౌతిక శాస్త్రంలో నోబెల్ పొందిన తొలి భారతీయుడు సి వి.రామన్ అన్నారు.ఈ దినోత్సవాన్ని .1987 నుండి జరుపుతున్నారనీ అన్నారు. ఇప్పలగూడెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించడానికి, విద్యార్థుల్లో విజ్ఞానాసక్తి పెంచడానికీ, పరిశోధనలను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాల నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు అడప రాజేందర్ విద్యార్థులచేసైన్స్ ప్రాజెక్టులు తయారు చేయించామని,క్విజ్ పోటీలు,వ్యాసరచన, ప్రసంగ పోటీలు నిర్వహించామని తెలియజేశారు.

## భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లను సన్మానించిన వినాయక కాలనీవాసులు



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వినాయక కాలనీ అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ మరియు 9వ వార్డు కౌన్సిలర్ అప్పం కిషన్ ని కలిసి శాలువాలు కప్పి ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూపాలపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే చైర్మన్, వైస్ చైర్మన్ సమన్వయంతో పని చేయాలని సూచించారు.ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యం ఇచ్చి డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా పాలన సాగాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సామల లక్ష్మారెడ్డి, సాదు సదానంద, కసిగంటి భద్రయ్య, రత్నం రోషిరెడ్డి, గార్లపాటి రామ్ రెడ్డి, వావిలాల హరీష్, పసునూటి సుమన్, గోపతి రాజు తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో సి వి రామన్ జయంతి వేడుకలు



**లింగాల గణపురం, ఫిబ్రవరి, 28 (ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సి.వి.రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సి.వి.రామన్ విజ్ఞాన శాస్త్రానికి చేసిన సేవలను కొనియాడారు. నిత్యజీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రయోజనాలను గురించి వివరించారు.విద్యార్థులు విభిన్నమైన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ప్రయోగాల ప్రదర్శన, వ్యాసరచన, రంగోలి పాటలు,క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సునీత ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి ):** సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.శనివారం జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పలు కీలక శాఖల్లో గిరిజన జాతి అధికారులు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతికి సేవ చేయడం ప్రతి ఒక్కరికి దక్కే అదృష్టమని అన్నారు.జిల్లా కేంద్రంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారా భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు అభినందనలు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆ రోజుల్లోనే బంజారా జాతికి విద్యా, విజ్ఞాన పరంగా దిశానిర్దేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అధికారి నాగ సాగర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సంతోష్‌కుమార్, కమిటీ సభ్యులు దేవన్, కౌన్సిలర్లు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలి

- విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు
- నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్.






**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరగాలని, బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని ఆదేశించారు.జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతి రోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రోబోటిక్స్ లో కొడకండ్ల గురుకుల విద్యార్థినిల ప్రతిభ




**కొడకండ్ల, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి) :** సోహం అకాడమీ వారు శనివారం ఉప్పల్ లోని మినీ శిల్పారామంలో నిర్వహించిన ఐదవ వార్షిక రోబోటిక్స్ ఎగ్జిబిషన్ లో కొడకండ్ల గురుకుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఇట్ యువర్ సెల్ఫ్ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్టు ప్రిన్సిపల్ తమ్మి దిలీప్ కుమార్ తెలిపారు. సోహమ్ అకాడమీ వారు రాష్ట్రంలోని 250 కి పైగా ప్రభుత్వ పాఠశాలలో రోబోటిక్స్, స్టెమ్ పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయురాలు యమున, హారిక లతో పాటు విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందించారు.

## విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి : విస్డం పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్





**పర్వతగిరి, ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** మండల కేంద్రంలోని విస్డం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థినీ విద్యార్థుల ఎగ్జిబిట్స్ మరియు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. విద్యార్థులు తాము రూపొందించిన శాస్త్రీయ ప్రదర్శనలను ప్రదర్శించి వారి సృజనాత్మకతను చూపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, డైరెక్టర్స్ సుధాకర్, శ్రీనివాస్ లతో కలిసి సి.వి. రామన్ చిత్ర పటానికి పూలమాలవేసి విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైన్స్ అనేది మానవ జీవితంలో ఒక భాగమని, మానవ నాగరికత అభివృద్ధి చెందడానికి శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడిందని రాబోయే కాలంలో అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తుందని, సైన్స్ లేని ప్రపంచాన్ని మనము ఊహించలేము అన్నారు. విద్యార్థులు తమ ఆలోచన శక్తిని, సృజనాత్మకతను జోడించి భవిష్యత్తులో భారత దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందాలని, చంద్రశేఖర వెంకట రామన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలలో మరియు క్విజ్ లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఇంద్రజ, సునీత, పూజిత, సుమలత, శ్రీలేఖ, స్వాతి, మౌనిక, మానస, స్వస్తిక,కస్తూరి,ధరణి తదితరులు పాల్గొన్నారు.

## దళితులను చిన్నచూపు చూస్తే కఠిన చర్యలు తహసిల్దార్ అబిద్ అలీ



**చెన్నారావుపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని అక్కల్ చెడ గ్రామం ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చెన్నారావుపేట తాసిల్దార్ అబిద్ అలీ హాజరై మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, దళితులను ఎవరైనా చిన్న చూపు చూసినా లేదా వివక్షకు గురిచేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాల్లో అంటరానితనం వంటి దురాచారాలకు స్వస్తి పలకాలని, కుల వివక్ష చూపడం నేరమని పేర్కొన్నారు. బాధితులు ఎవరైనా వివక్షకు గురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సరోజ, సిహెచ్ఓ భద్రయ్య, హెచ్‌డబ్ల్యూఓ మల్లమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధ, గిర్దావర్ రషీద్, జూనియర్ సహాయకులు అంజాద్ ఖాన్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి ఇస్లావత్ రమ-గోపి నాయక్ నూతన గృహప్రవేశం వారి కూతురు చిన్నారి వైష్ణవి, కుమారుడు స్వాత్విక్ ల చెవులు కుట్టించుట, ధోతి కట్టించే వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీ లక్ష్మీరామానంద్.. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, 11వ వార్డు కౌన్సిలర్ చీకటి స్వరూప-ఓదెల్, 1వ వార్డు కౌన్సిలర్ కొత్తకొండ మేఘన-శ్యామ్ 3వ వార్డు కౌన్సిలర్ ముత్తినేని వెంకన్న, 4వ వార్డు కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనిషా-ప్రకాష్, 6వ వార్డు కౌన్సిలర్ పున్నం నరసింహారెడ్డి, 13వ భూక్య మత్రు రాథోడ్, 19వ కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్, 20వ వార్డు కౌన్సిలర్ శ్రీరామోజ్ రోజా రాణి, 22వ వార్డు కౌన్సిలర్ బాణాల ప్రసన్న- శ్రీనివాస్, 23వ కౌన్సిలర్ వేల్పుల శ్రీలత, 29వ వార్డు కౌన్సిలర్ వేముల సంధ్య-సాంబయ్య, 30వ కౌన్సిలర్ మాదాసి రవి, కోనాపురం సర్పంచ్ మైదం రాకేష్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, మాజీ ఎంపిటిసి కాట ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొర్ర రాహుల్, భూక్య గణేష్, షాలోమ్, చీకటి శివమణి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ స్కూల్లో ఘనంగా సైన్స్ ఫెయిర్



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఫిబ్రవరి 28 (ప్రజాజ్యోతి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెయిర్ ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వారి సృజనాత్మకతను చాటి చెప్పేలా 110 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే ను నిర్వహించడానికి కారణం భారత ప్రముఖ శాస్త్రవేత్త సి వి రామన్ ఆవిష్కరణ రామన్ ఎఫెక్ట్ ను స్మరించుకోవడం అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ద్రుకృతాన్ని పెంపొందించి సృజనాత్మకతను ప్రోత్సహించడం మరియు విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించామని ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనలకు పాఠశాల యజమాన్యం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జే రఘు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్చ్3.4తేదీలలో విజయవాడలో జరుగు పిడిఎస్యు జాతీయ ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి

- జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు కొమ్ముక రవి



**నర్సంపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి)** నర్సంపేట ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎసు యు ) జాతీయ ప్రథమ మహాసభలను 3,4 విజయవాడలో ఈ సందర్భంగా పి డి ఎస్ యు జాతీయ ప్రథమ మహాసభల గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం బిసి హాస్టల్ లో ఆవిష్కరించడం జరిగింది. ఈ జాతీయ మహాసభల్లో దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, విద్యార్థుల హక్కులకై అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం- 2020 విద్యను వ్యాపార సరుకుగా మార్చివేసి వ్యాపారీకరణ, కాషాయికారణ, కార్పోరేటీ కరణను పెంచే విధంగా ఉందని దేశంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కులం పేరుతో, మతం పేరుతో విద్యార్థుల మధ్య వివక్ష లను పెంచి పోషించే విధంగా విధానాలను ప్రకటిస్తున్నారని, యూజీసీ లాంటి రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని నిర్వీర్యపరుస్తున్నారని అన్నారు. యూజీసీ, ఏ ఐ సి టి ఈ, ఎన్ సీ ఈ అర్ టి లను రద్దు చేసి భారత ఉన్నత విద్యా కమిషన్ క్రిందకు తీసుకురావడం మొత్తం విద్యారంగాన్ని కేంద్రం తమ గుప్పెట్లో పెట్టుకోవడమేనని విమర్శించారు. దేశంలోకి విచ్చలవిడిగా విదేశీ ప్రైవేట్ యూనివర్సిటీలను అనుమతులు ఇస్తూ పేద వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం బయటకు వస్తుంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాల విఫలమయ్యారని అన్నారు. విద్యలో శాస్త్రీయ సాంకేతిక అంశాలను చేర్చకుండా కర్మకాండ సిద్ధాంతం,జ్యోతిష్య శాస్త్రం,ఇతిహాసాలు,పుక్కిటి పురాణాలను చేర్చడం వలన భారతదేశాన్ని మూఢత్వం వైపు నడిపిస్తున్నారని అని అన్నారు. ఇంకా ఈ జాతీయ మహాసభల్లో విద్యారంగంలో ఉన్నటువంటి మేధావులు వివిధ విద్యా అంశాలపై చర్చించి భవిష్యత్తు విద్యార్థి ఉద్యమ కార్యాచరణను బలోపేతం చేయడానికి,వేలాదిగా విద్యార్థులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు ఈ డివిజన్ నాయకులు భరత్.రాజు. శివ. సంతోష.సాయిరాం రమేష్ కార్యక్రమంలో తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన రెయిన్బో యూత్ అసోసియేషన్

- అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శ





**తరిగొప్పుల ఫిబ్రవరి 28 ప్రజాజ్యోతి :** అక్కరాజుపల్లి గ్రామంలో గత వారం రోజులలో అనారోగ్యంతో మృతిచెందిన బండ సుశీల మరియు బండ పూలమ్మ కుటుంబాలను రెయిన్బో యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గోరంతల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పరామర్శించి బియ్యం, నూనె మరియు నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లా డుతూ,"ఇలాంటి విషాదం ఏ కుటుంబానికైనా తీరని లోటే. కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ ఇంటికి పెద్ద దెబ్బ. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబాలు ధైర్యంగా ఉండాలి. వారి బాధలో మేము కూడా భాగస్వాములమే. వారికి అవసరమైన సహాయం అందించేందుకు మా వంతు కృషి ఎప్పుడూ కొనసాగుతుంది," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జొన్నగోని రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి సాంబరాజు, కోఆర్డినేటర్ సభ్యుడు పలుచని హరిప్రసాద్, సభ్యులు బొగం అనూప్, అంకం రాజు, మంచినీళ్ల హరిప్రసాద్, జొన్నగోని రాజు, తరుణ్, బండ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆత్మచైర్ పర్సన్ & కమిటీ మెంబెర్స్ ప్రమాణస్వీకరం

- మంత్రి సీతక్క చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మండల ఇంచార్జి ఇర్సవడ్ల వెంకన్న
- జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలో నేడు ఆదివారం మధ్యాహ్నం 12:00 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణి అనంతరం ఏటూరునాగారం ఎస్ ఎల్ ఎన్ ఫంక్షన్ హాల్ నందు మధ్యాహ్నం 12: 30కు మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షం లో ఆత్మచైర్ పర్సన్ & కమిటీ మెంబెర్స్ ప్రమాణస్వీకరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందినీ. ఏటూరునాగారం మండలంలోని జిల్లా, బ్లాక్,మండల, గ్రామ నాయకులు, సర్పంచులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలీని ఏటూర్ నాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న. ములుగు జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ లు ఒక ప్రకటనలో తెలిపారు.

## క్రషర్ బ్లాస్టింగ్లతో దద్దరిల్లుతున్న ప్రగతి సింగారం గ్రామం

- భయాందోళనలో ప్రజలు





**శాయంపేట ఫిబ్రవరి 28 ప్రజా జ్యోతి :** మండలంలోని ప్రగతి సింగారం గ్రామ శివారులో ఉన్న సాయిరాం క్రషర్ యజమాన్యం ఇష్టానుసారంగా రాత్రి పగలు తేడా లేకుండా బ్లాస్టింగ్ లు చేయడంతో ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టు అవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు . క్రషర్ చుట్టుపక్కలో ఉన్న వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తున్న కొంతమంది క్రషర్ బ్లాస్టింగ్ తో బయటకు వస్తున్న రాళ్లు ఎక్కడో తలుగుతాయో అని ప్రాణాలు అరి చేతిలో పెట్టుకొని బ్రతకవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. క్రషర్ బ్లాస్టింగ్ ల వల్ల ఇండ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయని ఇంట్లో ఉన్న సామాగ్రి కదులుతుందని చెప్పుకొచ్చారు. ఒక్కసారిగ క్రషర్ నుండి పెద్ద పెద్ద బాంబు బ్లాస్టింగ్ లు చేయడం వల్ల కిలోమీటర్ దూరంతో దుమ్ము, ధూళి వ్యాపించడంతో మనుషులు కనిపించినంతగా పొగ దాంతోపాటు వాసన ఇండ్ల ను ఇటు పొలాలను ఒక్కసారిగా కమ్మేసింది. పంట పొలాలు మొత్తం దుమ్ముకి తెల్లగా మారిపోయాయి. ఇదేమిటని అక్కడే ఉన్న కొంతమంది రైతులు క్రషర్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే మాకు పర్మిషన్ ఉంది మా ఇష్టం వచ్చినప్పుడు బ్లాస్టింగ్ లు చేస్తాం మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సమాధానం ఇస్తున్నారని ప్రజలు చెప్పుకొచ్చారు.పర్మిషన్ ఉన్న ఆ బ్లాస్టింగ్ లను ఎప్పుడు చేయాలి దానికి ఎలాంటి అనుమతులు తీసుకోవాలి బ్లాస్టింగ్ చేసేటప్పుడు చుట్టుప్రక్కల ఎవరైనా ఉన్నారా లేదా అనే విషయాలను పరిశీలించి చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ యాజమాన్యం అవి ఏమి చేయకుండా బ్లాస్టింగ్ లు చేపట్టింది. ప్రజలకు వాహనదారులకు చుట్టుప్రక్కల రైతులకు బ్లాస్టింగ్ వల్ల వచ్చే పెద్ద పెద్ద రాళ్లు మీద పడితే పరిస్థితి ఏంటి అనే అనుమానాలు రేకెత్తున్నాయి, దీనిపై అధికారులు స్పందించి క్రషర్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

- వార్డు కౌన్సిలరుతో కలిసి వార్డులో పర్యటించిన
- చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట ఫిబ్రవరి 28 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత పెద్దలు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నేడు స్థానిక కౌన్సిలరు పొన్నాల మనీషా-ప్రకాష్ తో కలిసి వార్డులో పర్యటించిన నర్సంపేట మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా అనంతరం ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణం తోపాటు వార్డుల సమగ్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందించడమే మా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.వార్డు పర్యటనలో భాగంగా వార్డులోని ఎస్టీ హాస్టల్ ను సందర్శించి విద్యార్థుల బాగోగులు తెలుసుకోవడం జరిగిందన్నారు అదే విధంగా ఇటీవల వార్డులో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగింది స్థానిక కౌన్సిలర్ మనీషా-ప్రకాష్ వార్డు పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు అదనంగా ఇవ్వాలని కోరారని వార్డులో సైడ్ కాలులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని మా దృష్టికి నేడు తీసుకురావడం జరిగిందని త్వరలోనే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి వార్డుకు అవసరమైన ఇంద్రమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు, సైడ్ కాలువలు నిర్మాణాలు చేపట్టి వార్డు ప్రజల సమస్యను తీరుస్తామన్నారు మున్సిపల్ అధికారులు సిబ్బంది సహకారంతో పారిశుధ్య సమస్య లేకుండా చేసి మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు నిరంతరము వార్డులో వార్డు సమస్యలను పరిష్కరిస్తామన్నారు ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో పార్టీలకు అతీతంగా వార్డులను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, సానిటేషన్ ఎస్సె శ్యామ్, 22వ వార్డు కౌన్సిలర్ బాణాల ప్రసన్న-శ్రీనివాస్, ఓబీసి జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, మాజీ ఎంపీటీసీ దారంగుల కొమురయ్య, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసు స్వామి, వరంగంటి కుమార్, విష్ణు, జగదీశ్వర్, సురేందర్, తొండల శ్రీను, నాగరాజు, జన్ను శ్రవణ్, నమైండ్ల రమేష్, దండుగుల విజయ్, అశోక్ , జంగా సాయి, వార్డు ఆఫీసర్లు, వార్డు జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.